ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక

## రిపోర్టర్లు కావలెను
అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం
తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా
జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా
రిపోర్టర్లు కావలెను.
ఉదయం
సంప్రదించండి
ఫోన్: 93910 89608

సంపుటి: 3 | సంచిక: 365 | పేజీలు: 6 | వెల: రూ.3/- | మంగళవారం 14 ఏప్రిల్ 2026 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి

# పునర్విభజన
# దేశానికి ప్రమాదకరం




**50 శాతం పెంపుతో తీవ్ర నష్టం**

**ఉత్తరాది, దక్షిణాది మధ్య గ్యాప్ పెంచొద్దు**

**మహిళా బిల్లు, పునర్విభజనతో ఎన్డీఏ కుట్రలు**

**హైబ్రిడ్ పాలసీతో డిలిమిటేషన్ మేలు**

**తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు**

**హైదరాబాద్, ఏప్రిల్ 13 (ప్రభాత ఉదయం)**

మహిళా రిజర్వేషన్లు, నియోజకవర్గాల పునర్విభజన అంశాలను కలిపి చూపిస్తూ కేంద్ర ప్రభుత్వం రాజకీయ వ్యూహాలు పన్నుతోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విమర్శించారు. సచివాలయంలో డీలిమిటేషన్ అంశంపై మాట్లాడారు. మహిళాబిల్లు, నియోజకవర్గాల పునర్విభజన రెండు అంశాలకు ఒకదానితో ఒకటి సంబంధం లేదని, ప్రతిపక్షాలు సహకరించడం లేదని ప్రచారం చేయడానికే కేంద్రం వీటిని ముడిపెడుతోందని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచి మహిళల రాజకీయ సాధికారతకు కట్టుబడి ఉందని, గతంలోనే రాజీవ్ గాంధీ స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు తీసుకువచ్చారని గుర్తు చేశారు. సోనియా గాంధీ హయాంలో మహిళా బిల్లు రాజ్యసభలో ఆమోదం పొందినా, అప్పట్లో బీజేపీ సహకరించకపోవడం వల్లే లోక్‌సభలో ఆగిపోయిందని గుర్తు చేశారు. ప్రస్తుతం మహిళా రిజర్వేషన్ల అమలును 2026 జనాభా లెక్కల తర్వాతే చేపడతామని చెప్పడం మహిళలను వంచించడమేనని రేవంత్ రెడ్డి ఆరోపించారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లోనే ఈ రిజర్వేషన్లు అమలు చేసి ఉంటే 181 మంది మహిళలు ఎంపీలుగా ఎన్నికయ్యే అవకాశం ఉండేదన్నారు. జనాభా లెక్కలతో సంబంధం లేకుండా, ప్రస్తుతం ఉన్న స్థానాల్లోనే వెంటనే మహిళా కోటాను అమలు చేయాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గాల ..మిగతా 2లో



# నారీశక్తి చాటేందుకే మహిళా బిల్లు

**రాజకీయాలకు మద్దతు అతీతం**

**నారీశక్తి చాటేందుకే మహిళా బిల్లు**

**ప్రధాని నరేంద్ర మోడీ పిలుపు**

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 13 (ప్రభాత ఉదయం)**

మహిళా రిజర్వేషన్ల చట్టాన్ని అసలైన స్ఫూర్తితో అమలు చేసే సమయం ఆసన్నమైందని భారత ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఇందుకోసం పార్లమెంట్ మూడు రోజులపాటు ప్రత్యేకంగా సమావేశం అవుతుందని, అన్ని పార్టీలు రాజకీయాలకు అతీతంగా మద్దతు ఇవ్వాలని కోరారు. ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో సోమవారం జరిగిన నారీశక్తి వందన్ సమ్మేళన్ కార్యక్రమంలో పలు రంగాల ప్రముఖులను ఉద్దేశించి ప్రధాని మోదీ ప్రసంగించారు. మహిళలకు సముచిత స్థానం కల్పించేందుకు, నారీ శక్తిని చాటిచెప్పేందుకు చారిత్రక మార్పు కోసం అందరూ చేతులు కలపాల్సిన అవసరం ఉందన్నారు. 2029లో జరగబోయే లోక్‌సభ, రాష్ట్రాల శాసనసభ ఎన్నికలను కచ్చితంగా 33 శాతం మహిళా రిజర్వేషన్లతోనే నిర్వహించుకుంటామని ప్రధాని మోదీ అన్నారు. ఈ లక్ష్యాన్ని సాధించేందుకు రాజకీయ పార్టీలన్నీ ఏకతాటిపైకి రావాలని, మహిళా రిజర్వేషన్ల చట్టంతో ముడిపడి ఉన్న సవరణ బిల్లులను ఏకాభిప్రాయంతో ఆమోదించాలని కోరారు. ఈ మేరకు వివిధ రాజకీయ పార్టీలకు చెందిన లోక్‌సభ, రాజ్యసభ పక్ష నాయకులకు ..మిగతా 2లో



# యూపిలో ఘోర రోడ్డు ప్రమాదం

**బస్సు, ట్రక్కు ఢీకొన్న ప్రమాదంలో ఆరుగురు మృతి**

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 13 (ప్రభాత ఉదయం)**

ఉత్తరప్రదేశ్ లో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. హాపూర్ ప్రాంతంలో బస్సు, ట్రక్కు ఢీకొన్న ఘటనలో ఆరుగురు ప్రాణాలు కోల్పోగా, ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. పెళ్లి వేడుక నుంచి తిరిగి వస్తున్న ప్రయాణికులతో వెళ్తున్న బస్సు ముందున్న ట్రక్కును ఢీకొట్టడంతో ఈ ప్రమాదం ..మిగతా 2లో

# దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరగబోదు



**రాజకీయం చేయకండి.. రేవంత్ రెడ్డికి కిషన్ రెడ్డి విజ్ఞప్తి**

**తాము కూడా దక్షిణాది రాష్ట్రంలోనే ఉన్నామన్న కిషన్ రెడ్డి**

**ఎట్టి పరిస్థితుల్లో అన్యాయం జరగనివ్వబోమని వ్యాఖ్య**

**హైదరాబాద్, ఏప్రిల్ 13 (ప్రభాత ఉదయం)**

కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై తీవ్రస్థాయిలో స్పందించారు. డీలిమిటేషన్, మహిళల రిజర్వేషన్లను రాజకీయం చేయవద్దని ఆయన కాంగ్రెస్ పార్టీని, రేవంత్ రెడ్డిని కోరారు. డీలిమిటేషన్ ప్రక్రియతో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరగబోదని హామీ ఇచ్చారు. మేం కూడా దక్షిణాది రాష్ట్రంలోనే ఉన్నామని వ్యాఖ్యానించారు. ఇక్కడి రాష్ట్రాలకు తాము ఎట్టి పరిస్థితుల్లో అన్యాయం జరగనివ్వబోమని హామీ ఇచ్చారు. 2011 జనాభా లెక్కల ప్రకారం డీలిమిటేషన్ జరుగుతుందని కిషన్ రెడ్డి అన్నారు. ఈ ప్రక్రియకు రెండేళ్ల సమయం పడుతుందని తెలిపారు. కాబట్టి ..మిగతా 2లో

## కేసీఆర్‌కు మంత్రి సీతక్క
# లీగల్ నోటీసులు

**48 గంటల్లోకి ఆ పోస్టులు తొలగించాలని డిమాండ్**

**అంగన్‌వాడీ ఫోన్ల కొనుగోలు విషయంలో నిరాధార ఆరోపణలు చేస్తున్నారని మండిపాటు**

**48 గంటల్లో పోస్టులు తొలగించి క్షమాపణలు చెప్పాలని నోటీసులు**

**హైదరాబాద్, ఏప్రిల్ 13 (ప్రభాత ఉదయం)**

అంగన్‌వాడీలకు మొబైల్ ఫోన్ల కొనుగోలుపై ఆరోపణలు విషయంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు తెలంగాణ మహిళా, శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క లీగల్ నోటీసులు పంపారు. నిరాధార ఆరోపణలు చేస్తూ తన ప్రతిష్ఠకు భంగం వాటిల్లేలా బీఆర్ఎస్ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారని ఆమె నోటీసుల్లో పేర్కొన్నారు. అంగన్‌వాడీలకు మొబైల్ ఫోన్ల కొనుగోలు ..మిగతా 2లో





# ఐటి ఉద్యోగుల భద్రతపై ప్రత్యేక దృష్టి

**ఆదివాసీ, గిరిజనుల సమగ్ర అభివృద్ధికి కృషి**

**సమస్యల పరిష్కారం పై ప్రత్యేక దృష్టి**

**సీఎం రేవంత్ రెడ్డి స్పష్టీకరణ**

**హైదరాబాద్,ఏప్రిల్13 (ప్రభాత ఉదయం)**

ఆదివాసీ, గిరిజన ,ఏజెన్సీ ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి అన్ని రకాల చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. మౌలిక వసతుల కల్పన కు అడ్డంకిగా ఉన్న సమస్యల పరిష్కారం పైన ప్రత్యేక దృష్టి సారిస్తానని ఆయన తెలిపారు. ఆదివాసీ, గిరిజన,ఏజెన్సీ ప్రాంతాల్లో అభివృద్ధి పనుల పైన మంత్రి సీతక్క నేతృత్వంలో గిరిజన,ఆదివాసీ ఎమ్మెల్యేల ..మిగతా 2లో



# పశ్చిమాసియాలో మళ్లీ యుద్ధమేఘాలు

**ఇరాన్‌పై దాడికి ట్రంప్, ఇజ్రాయిల్ సమాలోచనలు**

**ఎప్పుడు ఏం జరుగుతుందో అన్న ఆందోళన**

**వాషింగ్టన్,ఏప్రిల్13 (ప్రభాత ఉదయం)**

అమెరికా-ఇరాన్ మధ్య శాంతి చర్చలు విఫలమవడంతో పశ్చిమాసియా మళ్లీ నివురుగప్పిన నిప్పులా మారింది. ఏ క్షణాన ఏం ..మిగతా 2లో

# పునర్విభజన దేశానికి ప్రమాదకరం

**మొదటి పేజీ తరువాయి...**

పునర్విభజన అంశాన్ని ప్రధాని మోదీ దక్షిణాది రాష్ట్రాలపై ఒక రాజకీయ పావుగా వాడుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జనాభా ప్రాతిపదికన మాత్రమే సీట్ల పునర్విభజన జరిగితే దక్షిణాది రాష్ట్రాలకు తీరని అన్యాయం జరుగుతుందని రేవంత్ రెడ్డి హెచ్చరించారు. కుటుంబ నియంత్రణను పకడ్బందీగా అమలు చేసి జనాభాను నియంత్రించినందుకు దక్షిణాది రాష్ట్రాలను శిక్షించడం సరికాదన్నారు. గతంలో ఇందిరా గాంధీ ఈ వివక్షను గమనించే సీట్ల పెంపుపై నిషేధం విధించారని గుర్తు చేశారు. ఇప్పుడు కేవలం జనాభా ప్రాతిపదికన సీట్లు పెంచితే ఉత్తరాది, దక్షిణాది రాష్ట్రాల మధ్య రాజకీయ అంతరం విపరీతంగా పెరుగుతుందని, ఇది దేశ సమగ్రతకు మంచిది కాదని అభిప్రాయపడ్డారు. బీజేపీ హయాంలో దక్షిణాది రాష్ట్రాలకు కేంద్రంలో కీలక పదవులు దక్కడం లేదని, పునర్విభజన జరిగితే చిన్న రాష్ట్రాలు తమ రాజకీయ మనుగడను కోల్పోతాయని ముఖ్యమంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. వివక్ష పెరగడం వల్లే ప్రాంతీయ ఉ




ద్యమాలు వస్తాయని, బీజేపీ మళ్లీ అదే తప్పు చేస్తోందని విమర్శించారు. దక్షిణాది రాష్ట్రాలు దేశానికి ఆర్థిక రాజధానులుగా ఉండి అత్యధికంగా పన్నులు చెల్లిస్తున్నాయని, రాజకీయంగా వాటి ప్రాధాన్యతను తగ్గించే ప్రయత్నాలను సహించబోమని స్పష్టం చేశారు. ఈ సమస్య పరిష్కారానికి రేవంత్ రెడ్డి ఒక 'హైబ్రిడ్ మోడల్'ను ప్రతిపాదించారు. పెంచాలనుకుంటున్న సీట్లలో 50 శాతం జనాభా ప్రాతిపదికన, మిగిలిన 50 శాతం ఆయా రాష్ట్రాల జీఎస్డీపీ భాగస్వామ్యం ఆధారంగా కేటాయించాలని సూచించారు. ఈశాన్య రాష్ట్రాలకు జనాభా తక్కువగా ఉన్నా ప్రాతినిధ్యం కల్పించినప్పుడు, అభివృద్ధిలో ముందున్న రాష్ట్రాలకు అదే గౌరవం ఎందుకు ఇవ్వరని ప్రశ్నించారు. ఇది కేవలం రాజకీయ పార్టీలకు సంబంధించింది కాదని, ప్రజల భవిష్యత్తుకు సంబంధించిన అంశమని పేర్కొన్నారు. హడావుడిగా నిర్ణయాలు తీసుకోకుండా ఈ అంశంపై అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని, నిపుణులతో కమిటీ వేసి అన్ని రాష్ట్రాల అసెంబ్లీల్లో చర్చించాలని రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. 2028 మార్చి వరకు ఈ ప్రక్రియను పూర్తి చేసే అవకాశం ఉన్నందున, ప్రజాస్వామ్యబద్ధంగా సంప్రదింపులు జరపాలని కోరారు. ఉత్తరాది, దక్షిణాది మధ్య గ్యాప్ పెంచేలా కేంద్రం వ్యవహరించవద్దని హితవు పలికారు.

# కేసీఆర్‌కు మంత్రి సీతక్క లీగల్ నోటీసులు

**మొదటి పేజీ తరువాయి...**

ప్రక్రియను తెలంగాణ టెక్నాలజీ సర్వీసెస్ లిమిటెడ్ నిర్వహించిందని సీతక్కతెలిపారు. టెండర్ వాల్యుయేషన్ కమిటీ నిర్ణయాల ప్రకారం కాంట్రాక్ట్ ఇచ్చినట్లు ఆమె నోటీసుల్లో పేర్కొన్నారు. ఇందులో తనకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. మొత్తం టెండర్ విలువ రూ.44 కోట్లు ఉంటే అందులో రూ.30 కోట్ల అవినీతి జరిగిందని ఆరోపణలు చేస్తున్నారని.. తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ అధికారిక సోషల్ మీడియాలో దుష్ప్రచారానికి కేసీఆర్ బాధ్యత వహించాలని సీతక్క డిమాండ్ చేశారు. 48 గంటల్లో పోస్టులు తొలగించి కేసీఆర్ క్షమాపణ చెప్పాల్సిందేనని ఆమె పేర్కొన్నారు. లేదంటే సివిల్, క్రిమినల్ చర్యలు తీసుకుంటానని లీగల్ నోటీసులో సీతక్క వెల్లడించారు. అసలేంటీ వివాదం : చిన్నారులకు విద్యతో పాటు, పౌష్టికాహారాన్ని అందించే అంగన్‌వాడీ టీచర్లకు ప్రభుత్వం రూ.44 కోట్లు వెచ్చించి సెల్‌ఫోన్లను అందించింది. గర్భిణులు, బాలింతలకు, పిల్లలకు పోషకాలతో కూడిన ఆహారాన్ని అందించటంలో అంగన్‌వాడీ కేంద్రాలు ముఖ్యపాత్ర పాత్ర పోషిస్తున్నాయి. పిల్లల హాజరు, పౌష్టికాహారం అందించే వివరాలను సెల్‌ఫోన్లలో టీచర్లు ఎంటర్ చేస్తున్నారు. పోషణ్, ఎన్ఎస్టీఎస్ అనే యాప్‌ల ద్వారా గర్భిణుల, బాలింతల ఫేస్ రికగ్నిషన్ కోసం ఫోటో తీయాల్సి ఉంటుంది. అదేవిధంగా యుక్త వయసు పిల్లలకు పోషకాలను అందించాలనే ఉద్దేశంతో పల్లీ పట్టి అందిస్తున్నారు. ఈ వివరాలను కూడా అంగన్‌వాడీ టీచర్లు యాప్‌లో ఎంటర్ చేయాల్సి ఉంటుంది.

అంగన్‌వాడీ టీచర్లకు గతంలో సెల్‌ఫోన్లు అందించగా వాటికి 5జీ స్థాయి నెట్‌వర్క్ సామర్థ్యం లేదు. దీంతో సిగ్నల్ సరిగా ఉండని ప్రాంతాల్లో టీచర్లు వాటిని ఉ పయోగించటంలో ఇబ్బందులు ఎదురయ్యాయి. పోషణ్ యాప్‌ను వినియోగించటం సెల్‌ఫోన్లతో సాధ్యపడేది కాదు. భద్రాద్రి కొత్తగూడెం లాంటి జిల్లాలో ఏజెన్సీ ప్రాంతాలు ఎక్కువగా ఉండటంతో సెల్‌ఫోన్లకు సిగ్నల్ సరిగా ఉండదు. ఆ ప్రాంతాల్లో సెల్‌ఫోన్లు పనిచేయక పోవటంతో టీచర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో అందించిన స్మార్ట్ ఫోన్లకు అనేక సమస్యలు ఉత్పన్నం అవటంతో వినియోగించలేదు. ఈ సమస్య కారణంగా ప్రభుత్వం అధునాతన ఫీచర్లు ఉన్న నూతన సెల్‌ఫోన్లను అందించింది. అంగన్‌వాడీ టీచర్లకు నూతన సెల్‌ఫోన్లు అందించే ప్రక్రియ మొదలైంది. సెల్‌ఫోన్ల ద్వారానే అంగన్ వాడీ టీచర్లు విధులు నిర్వహించాల్సి ఉండటంతో వాటి అవసరం ఎంతో ఉంది. అయితే సెల్‌ఫోన్ల కొనుగోలు విషయంలో 30 కోట్ల అవినీతి జరిగిందని బీఆర్ఎస్ పార్టీ ఆరోపిస్తూ ప్రభుత్వంపై పలు విమర్శలు గుప్పించారు. ఈ సందర్భంగా తనపై అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారని, ప్రతిష్ఠకు భంగం కలిగే విధంగా సోషల్ మీడియాలో పోస్టులు చేస్తున్నారని వాటిని తొలగించి, క్షమాపణలు చెప్పాల్సిందేనని బీఆర్ఎస్ అధినేతకు సీతక్క నోటీసులు పంపించారు.

ఎందుకు లీగల్ నోటీసులు పంపించారు : కేసీఆర్‌కు సీతక్క లీగల్ నోటీసులు పంపడంపై బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్ స్పందించారు. అంగన్వాడీ టీచర్ల స్మార్ట్‌ఫోన్లలో అవినీతి జరిగిందని ఆరోపించారు. 35,310 స్మార్ట్‌ఫోన్ల కోసం రూ.54 కోట్లకు టెండర్ ఇచ్చారని, స్మార్ట్‌ఫోన్లపై రూ.24 కోట్లే ఖర్చు చేశారని, మిగిలిన రూ.30 కోట్లు ఏమయ్యాయని ప్రశ్నించారు. 4జీ ఫోన్లు ఇస్తూ 5జీ ఫోన్లు ఇస్తున్నామని చెప్పుకుంటున్నారని విమర్శించారు. సమాధానం చెప్పమంటే సీతక్క చెప్పుతో కొడతామంటున్నారని, తాము అడిగిన ప్రశ్నలకు కేసీఆర్ క్షమాపణ చెప్పాలని సీతక్క అంటున్నారని పేర్కొన్నారు. సీతక్క కేసీఆర్‌కు ఎందుకు లీగల్ నోటీసులు పంపించారని ప్రశ్నించారు.

# పశ్చిమాసియాలో మళ్లీ యుద్ధమేఘాలు

**మొదటి పేజీ తరువాయి...**

జరుగుతుందో అర్థం కాని పరిస్థితి నెలకొంది. మరోవైపు, ఇరాన్‌పై మళ్లీ దాడులు ప్రారంభించేందుకు అమెరికా, ఇజ్రాయెల్ సిద్ధమవుతున్నట్లు వార్తలు రావడం ఆందోళన కలిగిస్తోంది. హర్మూజ్ జలసంధిని దిగ్బంధిస్తామని అమెరికా సెంట్రల్ కమాండ్ ఇప్పటికే ప్రకటించిన సంగతి తెలిసిందే. దీంతో పాటు ఇరాన్‌పై పరిమిత స్థాయిలో సైనిక దాడులను పునరుద్ధరించేలా అగ్రరాజ్య అధ్యక్షుడు ట్రంప్ సలహాదారులు ప్రణాళికలు రచిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ పలు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. అయితే, ఈ దాడులకు ట్రంప్ అంగీకరిస్తారా? లేదా అనేదానిపై ఇంకా స్పష్టత లేదు. ఇరాన్ (ఎసజీని)ను నలువైపులా నిర్బంధించి, హర్మూజ్ జలసంధిపై నియంత్రణ తెచ్చుకోవాలని ట్రంప్ భావిస్తున్నట్లు సమాచారం. మిత్ర దేశాలతో కలిసి ఈ మార్గంలో ప్రయాణించే నౌకలకు భద్రత కల్పించే అంశంపై అమెరికా అధ్యక్షుడు చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. అటు, ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ కూడా ఇరాన్‌పై దాడులు సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని ఐడీఎఫ్ చీఫ్ ఆఫ్ స్టాఫ్ లెఫ్టినెంట్ జనరల్ ఇయాల్ జమీర్ తన సైన్యాన్ని ఆదేశించినట్లు ఇజ్రాయెల్ మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఇరాన్‌పై దాడుల



పునరుద్ధరణ విషయంలో ట్రంప్ నిర్ణయం కోసం ఇజ్రాయెల్ ఎదురుచూస్తున్నట్లు ఆ కథనాలు తెలిపాయి. అయితే, ఈలోగా టెహ్రాన్ తమపై దాడి చేస్తే మాత్రం ప్రతిస్పందన తీవ్రంగా ఉంటుందని ఐడీఎఫ్ హెచ్చరిస్తోంది. ఇదిలా ఉ ండగా.. యూఎస్-ఇరాన్ చర్చలు విఫలం కావడంతో పశ్చిమాసియాలో మరోసారి ఉద్రిక్తతలు చెలరేగాయి. ఇరాన్ పోర్టుల నుంచి నౌకలు హోర్ముజ్ మీదుగా రాకపోకలు సాగించకుండా నేటి సాయంత్రం 7.30 (భారత కాలమానం ప్రకారం) నిర్బంధం విధిస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. దీంతో పాటు ఇరాన్‌పై యూఎస్, ఇజ్రాయెల్‌లు మళ్లీ దాడులు చేసేందుకు ప్రణాళికలు రచిస్తున్నట్టు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. అణు కార్యక్రమాన్ని వదులుకునేలా ఇరాన్‌పై ఒత్తిడి తెచ్చేందుకు ఇజ్రాయెల్ దాడులను ప్లాన్ చేస్తున్నట్టు మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఆర్మీ సిద్ధంగా ఉ ండాలని ఇప్పటికే ఇజ్రాయెల్ రక్షణ దళం చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ జమీర్ ఆదేశించారు. మరోవైపు, ఇరాన్‌పై పరిమిత స్థాయిలో దాడులు చేసేందుకు ట్రంప్, ఆయన సలహాదారులు యోచిస్తున్నట్టు తెలుస్తోంది. ఇరాన్‌ను అన్ని వైపుల నుంచి దిగ్బంధించి చర్చల్లో ప్రతిష్టంభనను తొలగించాలనేది యూఎస్ ప్రభుత్వం ఉద్దేశమని కథనాలు వెలువడ్డాయి. ఈ దిశగా నాటో దేశాలను కూడా రంగంలోకి దింపేందుకు అమెరికా ప్రభుత్వం ప్రయత్నిస్తున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే హోర్ముజ్ మీదుగా నౌకల రాకపోకలను ఇరాన్ నిలిపివేసిన విషయం తెలిసిందే. హోర్ముజ్ జలాల్లోకి యూఎస్ యుద్ధ నౌకలు వస్తే దాడులు తప్పవని హెచ్చరించింది. చర్చలు విఫలం కావడానికి అమెరికానే కారణమని తేల్చి చెప్పింది. యూఎస్ పెట్టిన అసమంజసమైన డిమాండ్స్ కారణంగానే చర్చల్లో

పీటముడి పడిందని పేర్కొంది. అణు కార్యక్రమం వదులుకునే దిశగా ఇరాన్ నుంచి స్పష్టమైన హామీలు రాలేదని యూఎస్ ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ పేర్కొన్నారు.

# నేషనల్ హైవేస్ అంబులెన్స్ ప్రారంభం

## ప్రాణ రక్షణలో కీలక అడుగు

## జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా


**జనగామ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 13(ప్రభాత ఉదయం):**

99 రోజుల ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న అరైవ్ -- అలైవ్ కింద రోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా నేషనల్ హైవేస్ (యాదాద్రి - వరంగల్ ఎన్హెచ్ - 163) అధ్వర్యంలో ఆధునిక సదుపాయాలతో కూడిన నూతన అంబులెన్స్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో చేపట్టిన కార్యక్రమంలో డీసీపీ రాజ మహేంద్ర నాయక్ తో కలిసి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా నూతన అంబులెన్స్ కు జెండా ఊపి ప్రారంభించారు. ఈ అంబులెన్స్ ద్వారా జాతీయ రహదారిపై జరిగే ప్రమాదాల సమయంలో గాయపడిన వారికి తక్షణమే అత్యవసర వైద్య సేవలు అందించేందుకు వీలు కలుగుతుందని కలెక్టర్ తెలిపారు. రోడ్డు ప్రమాదాల సమయంలో గోల్డెన్ అవర్ లో అందించే వైద్య సేవలు ప్రాణాలను కాపాడడంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ఈ కొత్త అంబులెన్స్ ఆధునిక వైద్య పరికరాలతో సన్నద్ధంగా ఉండి, ప్రమాద బాధితులను సమీప ఆసుపత్రులకు వేగంగా తరలించేందుకు ఉపయోగపడుతుందని



ఎన్‌ఎచ్ అంబులెన్సు ప్రారంభించిన కలెక్టర్

వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్హెచ్ఏఐ పీడీ భరద్వాజ్, ఆర్టీవో శ్రీనివాస్ గౌడ్, ఆర్టీఏ సభ్యులు చిలువేరు అభి గౌడ్, ఇతర సంబంధిత అధికారులు, పోలీసు అధికారులు, పోలీసు, ఎన్హెచ్ఏఐ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# నారీశక్తి చాటేందుకే మహిళా బిల్లు

**మొదటి పేజీ తరువాయి...**

లేఖలు రాసినట్లు తెలిపారు. మహిళా రిజర్వేషన్ల చట్టంపై సమగ్రంగా చర్చించేందుకు తమ ప్రభుత్వం ఏప్రిల్ 16వ తేదీ నుండి మూడు రోజుల పాటు పార్లమెంటు ప్రత్యేక సమావేశాలను నిర్వహించనుందని మోదీ తెలిపారు. నేటి కార్యక్రమంలో ప్రసగించిన ప్రధాని మోదీ ఎంపీలకు రాసిన లేఖలో పేర్కొన్న కొన్ని కీలక అంశాలను ప్రస్తావించారు. 2029 నుండి ఈ చట్టం అమల్లోకి వస్తే దేశంలోని ప్రజాస్వామిక సంస్థలకు సరికొత్త బలం చేకూరుతుందని పేర్కొన్నారు. చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించాలనే అంశం దశాబ్దాలుగా కేవలం చర్చలకే పరిమితం కాగా, తమ ప్రభుత్వం 2023లోనే దీనిపై చట్టం చేసిందని నరేంద్ర మోదీ గుర్తు చేశారు. 'నేను 2001లో కొత్తగా గుజరాత్ ముఖ్యమంత్రిని అయ్యాను. అప్పట్లో నాకు ప్రభుత్వం నడపడంలో అంతగా అనుభవం లేదు. 2002 లేదా 2003లో మా ఎమ్మెల్యే ఒకరు నా వద్దకు వచ్చి నియోజకవర్గంలోని ఒక గ్రామ పంచాయతీకి చెందిన మహిళలు మిమ్మల్ని కలవాలనుకుంటున్నారని చెప్పారు. ఆ పంచాయతీలోని సభ్యులందరూ మహిళలే అని చెప్పడంతో ఆశ్చర్యపోయా. వారు నన్ను కలవడానికి వచ్చినప్పుడు అది ఎలా సాధ్యమని, మీ లక్ష్యం ఏమిటి అని వారిని అడిగాను. రాబోయే 5 ఏళ్లలో ఏం చేయాలనుకుంటున్నారని అడిగాను. 8వ తరగతి వరకు చదువుకున్న ఆ మహిళా సర్పంచ్ ఇచ్చిన సమాధానం నన్ను ఆశ్చర్యపరిచింది. నేటికీ ఆమె సమాధానం నాకు గుర్తుంది. ఆమె ఏమన్నారంటే 'మా గ్రామంలో ఒక్క వ్యక్తి కూడా పేదవాడిగా మిగిలిపోకూడదు అని మేం కోరుకుంటున్నాము' అని ఆమె చెప్పారని' ప్రధాని మోదీ ఆసక్తికర విషయాన్ని ఈ సందర్భంగా షేర్ చేసుకున్నారు. దేశ జనాభాలో దాదాపు సగం ఉన్న మహిళలకు చట్టసభల్లో రాజకీయ భాగస్వామ్యాన్ని పెంచేందుకు కేంద్రం చర్యలు చేపట్టింది. మహిళా రిజర్వేషన్ చట్టాన్ని త్వరితగతిన అమల్లోకి తీసుకురావడంపైనే ఫోకస్ చేసినట్లు ప్రధాని మోదీ స్పష్టం చేశారు. మహిళల అభ్యున్నతి కోసం నిర్వహించే ఈ ప్రత్యేక పార్లమెంటు సెషన్‌లో ఎంపీలంతా రాజకీయాలకు అతీతంగా ముఖ్యమైన అంశానికి మద్దతు తెలిపి, ఈ చరిత్రాత్మక మార్పునకు నాంది పలకాలని కోరారు. ఈ నెల 16 నుంచి ప్రారంభమయ్యే పార్లమెంటు ఉభయ సభల ప్రత్యేక సమావేశాలకు తప్పనిసరిగా హాజరు కావాలని బీజేపీ తమ పార్టీ ఎంపీలకు విప్ సైతం జారీ చేసింది.

# దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరగబోదు

**మొదటి పేజీ తరువాయి...**

ఈ ప్రక్రియను ఎవరు కూడా రాజకీయం చేయవద్దని కోరారు. దక్షిణాది నుంచి ప్రస్తుతం కిషన్ రెడ్డి, బండి సంజయ్ కేంద్రమంత్రులు అయ్యారని, డీలిమిటేషన్ జరిగితే చప్రాసీ పదవి కూడా రాదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అంటున్నారని, ఈ వ్యాఖ్యలపై మీరేం సమాధానం చెబుతారని కిషన్ రెడ్డిని మీడియా ప్రతినిధులు ప్రశ్నించారు. దానికి కిషన్ రెడ్డి స్పందిస్తూ, రేవంత్ రెడ్డి వారానికి ఒకసారి ఢిల్లీకి వెళుతున్నారని, ఎందుకు అలా వెళుతున్నారో ఆయన సమాధానం చెప్పాలని నిలదీశారు. కానీ కాంగ్రెస్ పార్టీలో ఏ పదవి కావాలన్నా ఆయన ఢిల్లీకి డబ్బులు మోసుకెళుతున్నారని ఆరోపించారు. కానీ బీజేపీలో అలా ఉండదని అన్నారు. అందుకే ఆయన చప్రాసీ వ్యాఖ్యలను ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నామని అన్నారు.

# యూపిలో ఘోర రోడ్డు ప్రమాదం

**మొదటి పేజీ తరువాయి...**

సంభవించినట్లు పోలీసులు తెలిపారు. ఘటన సమాచారం అందిన వెంటనే అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించారు. ఎస్పీ జ్ఞానంజయ్ సింగ్ వివరాల ప్రకారం, ఆరుగురు అక్కడికక్కడే మరణించారు. గాయపడిన వారిని సమీప ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రమాదానికి గురైన ట్రక్కును రహదారి నుంచి తొలగించి, ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. మృతుల కుటుంబ సభ్యులు సంఘటన స్థలానికి చేరుకుని విషాదంలో మునిగిపోయారు. బస్సులో ప్రయాణిస్తున్న 12 మందిని గుర్తించగా, ఒక వ్యక్తి ఆచూకీ ఇంకా తెలియరాలేదని అధికారులు తెలిపారు. బస్సు డ్రైవర్ నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణమై ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు.

# ఐటి ఉద్యోగుల భద్రతపై ప్రత్యేక దృష్టి

**మొదటి పేజీ తరువాయి...**

బృందం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని జూబ్లీహిల్స్ నివాసంలో కలిసి పలు సమస్యల పరిష్కారం కోసం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతు ఆదివాసీ,గిరిజనుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో చెక్ డ్యాం ల నిర్మాణంపైన దృష్టి సారిస్తామని వారికి సీఎం హామీ ఇచ్చారు. వీటి ద్వారా తాగు, సాగు నీటి అవసరాలను తీర్చవచ్చునని ఆయన అన్నారు. చెక్ డ్యాం లు, రహదారుల నిర్మాణం కోసం అటవీ శాఖ నుంచి ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. వీలైనంత త్వరగా అటవీ శాఖ నుంచి అనుమతులు వచ్చేలా చూస్తానన్నారు. ఆదివాసీ,గిరిజన రైతులు సాగు చేస్తున్న భూముల్లో బోర్లు వేయడానికి అనుమతులు ఇవ్వాలని చేసిన విజ&ఞప్తికి ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారు. అటవీశాఖ అభ్యంతరాల వల్ల రహదారుల మరమ్మత్తులు ఆలస్యం అవుతాయని, కొన్ని చోట్ల కొత్త రహదారులకు అనుమతులు ఇవ్వడం లేదని వారు సీఎం దృష్టికి తీసుకువచ్చారు. వీలైనంత త్వరగా వీటిపైన నిర్ణయం తీసుకోవాలని ముఖ్యమంత్రి అటవీ శాఖ అధికారులను ఆదేశించారు. ఆదివాసీ, గిరిజన ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇళ్ల కోటా పెంచే విషయాన్ని పరిశీలిస్తామని ఈ సందర్భంగా ఆయన వారికి హామీ ఇచ్చారు.ఐటీడీఏ లను మరింత బలోపేతం చేస్తామన్న ముఖ్యమంత్రి ఆదివాసీ, గిరిజనులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని స్పష్టం చేశారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మురళి నాయక్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారిని కలిసిన వారిలో ఉన్నారు.

### ఈసా నదిని ఆనుకుని ప్రభుత్వం చేయదలచుకున్న అభివృద్ధిని

# రైతులకు చెబితే రైతులే ఆ అభివృద్ధి పనులు చేపడతారు




రైతులనుద్దేశించి మాట్లాడుతున్న చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి




రైతులతో మాట్లాడుతున్న బీ ఆర్ ఎస్ రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జీ పి కార్తీక్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తోకల శ్రీనివాస్ రెడ్డి




రైతు ఎం నరసింహ

## చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి

**రాజేంద్రనగర్, ఏప్రిల్ 13(ప్రభాత ఉదయం)**

హిమాయత్ సాగర్ నుంచి బాపూఘాట్ వరకు ఈసా నది పొడవునా ఉప్పర్ పల్లి, హైదర్ గూడ బస్తీలకు చెందిన 64 మంది పట్టాదారులకు చెందిన 32 ఏకరాలను గాంధీ సరోవర్ ప్రాజెక్టు పేరుతో ప్రభుత్వం తీసుకుంటాననడం బాధాకరమని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి అన్నారు. "న్యాయం కోసం పోరాటం, గాంధీ పేరిట రైతులకు టోపీ – ఇదెక్కడి న్యాయం, బడా బాబుల కోసం బక్క రైతుల బలి– ఇదేమి న్యాయం" అంటు హైదర్ గూడ, ఉప్పర్ పల్లి రైతులు వారి కుటుంబ సభ్యులు సోమవారం ఈసా నది పరివాహక ప్రాంతంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, తాను ఇక్కడికి లీడర్ గా , నాయకునిగా రాలేదని, మీరంతా నా ఓటర్లని, మీ బాధలు వినడానికి వచ్చానన్నారు. అందు కోసం నాకు జీతం వస్తుందన్నారు. రాజకీయాలు చేయడానికి రాలేదన్నారు. గతంలో రోడ్లు, కెనాల్స్, ట్రాన్స్ ఫార్మర్లు, టవర్లు పెట్టడానికి భూ సేకరణ జరిపేవారని గుర్తు చేశారు. నేడు కాంగ్రెస్ ప్రభుత్వం ఇండస్ట్రీయల్ పార్కుల కోసం బడా బాబులకు కేటాయించడానికి రైతుల భూములు లాక్కొంటుందన్నారు. నా పార్లమెం టు నియోజకవర్గంలోని నాలుగు మండలాలలో భూములను రైతులనుంచి లాక్కొని ఇండస్ట్రీయల్ పార్కుల ఏర్పాటు కోసం బడా బాబులకు కేటాయించే పనిలో ప్రభుత్వం ఉందని అందుకే రైతుల భూములు లాక్కొంటుందన్నారు. నా పార్లమెంటు నియోజకవర్గంలోని నాలుగు మండలాలలో భూములను రైతులనుంచి లాక్కొని ఇండస్ట్రీయల్ పార్కుల ఏర్పాటు కోసం బడా బాబులకు కేటాయించే పనిలో ప్రభుత్వం ఉందని ఇది మంచి విధానం కాదన్నారు. గత పాలకులు రాష్ట్రంలో ఈ విధానాన్ని కొనసాగించారని, ఇప్పటి ప్రభుత్వం కూడా అదే విధానాన్ని కొనసాగిస్తున్నారన్నారు. నిజాం ప్రభువులు ఇండస్ట్రీయల్ పార్కు ఏర్పాటు చేస్తే ఆర్టీసీ ఎక్స్ రోడ్స్ లో ఉన్న ప్రభుత్వ భూమిలో అప్పట్లో ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. ఉప్పర్ పల్లి, హైదర్ గూడ రైతుల పోరాటం న్యాయమైనదని బావిస్తున్నానన్నారు. మూసీ పక్కనుంచి రోడ్డు వేసుకోవడానికి మీరు స్థలం ఇస్తామంటున్నారని మీ పెద్ద మనస్సును మెచ్చుకుంటున్నానన్నారు. మూసీ పక్కన ఉన్న రైతుల భూములు తీసుకుంటామంటున్న ప్రభుత్వం ఆ భూములు ఎందుకు తీసుకుంటున్నారో చెప్పాలన్నారు. దేనికి ఉప యోగిస్తున్నారో చెప్పి తీసుకోవాలన్నారు. ప్రభుత్వం ఈసా నది పరివాహక ప్రాంతంలో ఎం పెట్టాలనుకుంటున్నారో.. రైతులకు చెప్పాలని, వారే ఆ హోటళ్ళు, మాల్ లు నిర్మించుకుంటారని గుర్తు చేశారు. అలా కాకుండ ప్రభుత్వం రైతులనుంచి భూములను లాక్కొని ఇతర కంపెనీలకు కేటాయించి రైతులకు నష్టపరిహారం ఇస్తామనడం భావ్యం కాదని, అది బ్రోకర్లు చేసే పని అన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేయమన్న హోటల్, మాల్ లు ఏర్పాటు చేయడం సాధ్యం కానప్పుడు వారు అమ్ముతారని, ఇదే విషయాన్ని రైతులు ప్రభుత్వానికి తెలియజేయాలన్నారు. టిప్పుకాన్ బ్రిడ్జి వద్ద ఉన్న మధురిడ్జ్ పార్కు భవనానికి అనుమతులు ఇచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, కూల్చివేస్తామంటున్నది కూడా కాంగ్రెస్ ప్రభుత్వమేనని అది కూడా మంచి పద్దతి కాదన్నారు. ఈసా పరివాహక ప్రాంతంలో ఎకరం ధర రూ. 50 కోట్లు ఉందని, దానికి రెండింతలు ఎక్కువ అంటే రూ.150 కోట్లు ఎకరాకు ఇవ్వాలని రైతులు కోరుతున్నారని, దానిలో నిజముందన్నారు. అలా కాకుండ రూ.50 కోట్లు పలికే ఎకర స్థలానికి రూ. 2 కోట్లు నష్టపరిహారం ఇస్తామంటే ఎలా అని ప్రశ్నించారు. మొన్నటి వరకు గతంలో ప్రభుత్వం లో ఉన్న వారు రైతుల భూములు లాక్కొన్నారని వాపోయారు. ఫార్మ సిటీ పేరుతో నాలుగు వేల ఎకరాలు, చందన్వెల్లిలో 1100 ఎకరాలు, సీతారాంపూర్ లో 1100 ఎకరాలు, మల్లన్న సాగర్ ఊర్లన్ని ముంచేశారని గుర్తు చేశారు. ఇప్పుడు మీ దగ్గరకు వారే వచ్చి రాజకీయాలు చేయాలనుకుంటారని, వారి మాటలు న్మవద్దన్నారు. న్యాయస్థానాలను ఆశ్రయించాలని, సోషల్ మీడియా లో మీకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రపంచానికి తెలియజేయాలని రైతులకు సూచించారు.

**రైతుల పక్షాన నిలబడి పోరాడుతా : పి కార్తీక్ రెడ్డి :**

నిరసన కార్యక్రమానికి మద్దతు తెలిపిన బీఆర్ఎస్ రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జి పి కార్తీక్ రెడ్డి మాట్లాడుతూ, ఈసా నది పరివాహక ప్రాంతంలో రైతుల భూములు తీసుకుని ఎం చేస్తారో చెప్పని ప్రభుత్వం ఎలా రైతులనుంచి భూములు తీసుకుంటుందన్నారు. ప్రభుత్వం దగ్గర డబ్బులు లేవని, అలాంటప్పుడు ఈ ప్రాజెక్టులన్ని ఎలా పూర్తి చేస్తారని ప్రశ్నించారు. హైదర్ గూడ, ఉప్పరపల్లి రైతులకు అండగా ఉంటానని, ఒక్క ఎకరం కూడా పోనివ్వకుండ చూస్తానని, గట్టిగా పోరాడుదాం అని పిలుపునిచ్చారు.

**బీజేపీ అండగా ఉంటుంది: తోకల శ్రీనివాస్ రెడ్డి**

హైదర్ గూడ , ఉప్పర్ పల్లి రైతులకు బీజేపీ అండగా ఉంటుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తోకల శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత పేదల భూములను, రైతుల భూములను, పేదల ఇండ్లను కూల్చడమే పనిగా పెట్టుకుందన్నారు. కాంగ్రెస్కు తగిన బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. ఈసా నది పరిసరాలలో ఉన్న రైతుల భూములను కాపాడేందుకు బీజేపీ అండగా ఉంటుందన్నారు

ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు టి అంజన్ కుమార్, ఈసా నది పరివాహక ప్రాంతంలో ఉన్న రైతులు రాజమల్లయ్య, కొలన్ సుబాష్ రెడ్డి , మోంద్ర నర్సింహ్మ, ఎం కొమురయ్య, పెంటారెడ్డి, విజయ్ కుమార్ , వెం కటేశ్, లతో పాటు పెద్ద ఎత్తున రైతులు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.


### భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా

# విగ్రహం శుద్ధి చేసిన బిజెపి నాయకులు

**రాజేంద్రనగర్, ఏప్రిల్ 13 (ప్రభాత ఉదయం)**

భారతీయ జనతా పార్టీ రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షులు సందీప్ ముదిరాజ్ ఆధ్వర్యంలో రాజేందర్ నగర్ చౌరస్తాలో భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా విగ్రహాన్ని శుభ్రం చేశారు.ఈ కార్యక్రమంలో బీజేపీ గోల్కొండ ఇన్చార్జ్ వైస్ శ్రీధర్, రాష్ట్ర ఎస్సీ మోర్చా కోరని సదానందం,మాజీ అధ్యక్షుడు బాబురావు, జిల్లా బీజేపీ మహిళా మోర్చా కార్యదర్శి వనితారెడ్డి, జిల్లా ఎస్సీ మోర్చా రవీందర్, బండారి బాలకృష్ణ, శశి,శ్రీనివాస్ రెడ్డి, సరితారెడ్డి, కవిత,పద్మావతి, వేణుగోపాల్, విజయ్ యాదవ్, పెంటయ్య, షేక్ బాషా , నాయకులు పాల్గొన్నారు.





# జనగామలో ఘనంగా అంబేద్కర్ జ్ఞాన యాత్ర

**జనగామ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 13 (ప్రభాత ఉదయం):**

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 135 వ జయంతిని పురస్కరించుకొని సోమవారం రాత్రి జనగామ రైల్వే స్టేషన్ నుండి బస్టాండ్ అంబేద్కర్ చౌరస్తా వరకు అంబేద్కర్ జ్ఞాన యాత్ర ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జనగామ శాసనసభ్యులు పల్లా రాజేశ్వర్ రెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సీ రెడ్డి,లు పాల్గొని జెండా ఊపి యాత్ర ను ప్రారంభించారు. ఈ కార్యక్రమం లో జనగామ మున్సిపల్ చైర్మన్ కడకంచి బాలమణి శ్రీనివాస్ పాలకుర్తి వ్యవసాయ మార్కెట్ చైర్మన్ మంజుల జనగామ మున్సిపల్ వైస్ చైర్మన్ భూష పర్వతాలు మూడవ వార్డు కౌన్సిలర్ బూడిద జ్యోతి గోపి 13వ వార్డు కౌన్సిలర్ పానుగంటి సువార్త 14వ వార్డు కౌన్సిలర్ టి. ఆండాలు. మరియు భారీ ఎత్తున పాల్గొన్న సామాజిక సంఘాలు వివిధ రాజకీయ పార్టీల నాయకులు డాక్టర్స్ లాయర్స్ ఉపాధ్యాయులు పాత్రికేయులు యువతి యువకులు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అభిమానులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు



అంబేద్కర్ జ్ఞాన యాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు



కోలాటం ఆడుతున్న ఝాన్సీ రెడ్డి

# నేడు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలు

**బుద్వేల్, ఏప్రిల్ 13(ప్రభాత ఉదయం)**



ఈ నెల 14న ఉదయం 9 గంటల కు రాజేంద్రనగర్ అంబేద్కర్ చౌరస్తాలో భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు జయంతి ఉత్సవాల కమిటీ చైర్మన్ దాసరి రమేశ్, కో చైర్మన్ నందిగామ నర్సింహ్మ, ప్రధాన కార్యదర్శి మంగలారం శ్రీనివాస్, కోశాధికారి పలుగుచెరువు నరేందర్ లు ఓ ప్రకటనలో తెలిపారు. రాజేంద్రనగర్ సర్కిల్ లో మహనీయుల జయంతి ఉత్సవాల కమిటీ ఆద్వర్యంలో పెద్ద ఎత్తున నిర్వహించనున్న అంబేద్కర్ జయంతి ఉత్సవాలకు రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్, మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి, శాసనమండలి మాజీ చైర్మన్ కె.స్వామీగౌడ్, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద క్రిష్ణ మాదిగ, ముదిరాజ్ కార్పోరేషన్ ఛైర్మన్ బి. జ్ఞానేశ్వర్ ముదిరాజ్, వివిధ పార్టీల నాయకులు పి.కార్తీక్ రెడ్డి, వై.శ్రీదర్, మాజీ కార్పొరేటర్లు తోకల శ్రీనివాస్ రెడ్డి, పి అర్చన జయప్రకాశ్, మోం ద్ర సంగీత గౌరీశంకర్, మాజీ కార్పొరేటర్ టి. ప్రేమదాస్ గౌడ్ పాటు అన్ని పార్టీల నాయకులు, దళిత సంఘాల ప్రతినిధులు పాల్గొంటారన్నారు. కళాజాత బృందంతో పాటలు ఉంటాయన్నారు.

## కోట్లాది మంది మహిళల ఆకాంక్షను నేరవెర్చే దిశగా ప్రధాని నరేంద్రమోడి ప్రభుత్వం


### పార్లమెంట్ లో ఆమోదానికి ముసాయిదా బిల్లు సిద్ధం పట్ల బీజేపీ రంగారెడ్డి జిల్లా మహిళా మోర్చా కార్యదర్శి మేకల వనిత రెడ్డి హర్షం

**బుద్వేల్ ,ఏప్రిల్ 13(ప్రభాత ఉదయం)**



మేకల వనితా రెడ్డి

కేంద్ర ప్రభుత్వం లోక్ సభలో ప్రస్తుతం ఉన్న 543 స్థానాలను 816కు పెంచే ముసాయిదా బిల్లును సిద్దం చేయడంతో పాటు మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల కల్పనలో భాగంగా పార్ల మెంట్ లో 273 స్థానాలు మహిళలకు దక్క నుండడం శుభపరిణామం అని రంగారెడ్డి జిల్లా బీజేపీ రంగారెడ్డి జిల్లా మహిళా మోర్చా కార్యదర్శి మేకల వనిత రెడ్డి అన్నారు. నారీ శక్తివందన్ అదినియమ్ చట్టాన్ని 2029లోపు శాసనసభ ఎన్నికలు జరుగనున్న అన్ని రాష్ట్రాల్లో అమలులోకి తీసుకురావాలని ప్రధానమంత్రి నరేంద్ర మోడి కృతనిశ్చయంతో ఉండడం హర్షనీయమని ఆమె తెలిపారు. అందుకోసం పార్లమెంట్లో ఈనెల 16,17,18వ తేదీల్లో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. మహిళలు అభివృద్ధి సాధించినప్పుడే సమాజం పురోగమిస్తుందని, దేశంలోని జనాభాలో సగభాగం ఉన్న మహిళలు శాస్త్ర,సాంకే తిక,పారిశ్రామిక, క్రీడలు, రక్షణ,సంగీత,లలిత కళల రంగాల్లో సాధిస్తున్న విజయాలు కీర్తి పతాకాన్ని ఎగురవేస్తున్నాయని చెప్పారు. కోట్లాది మంది మహిళల ఆకాంక్షకు నరేం ద్రమోడి నేరవేర్చేందవుకు తీసుకున్న నిర్ణయం అభినందనీయమని వనితారెడ్డి అన్నారు. బిజెపి ప్రభుత్వహయాం లో గత 2023లో నారీ శక్తివం దన్ అదినయమ్ చట్టం పార్ల మెంట్లో ఆమోదం పొందడం జరిగిందని, ఈ చారిత్రాత్మక సమావేశంలో మహిళమణుల కోసం నరేంద్రమోడి చేపడు తున్న బృహత్కార్యానికి జాతీయ ప్రయోజనాలను దృష్టిలో పెట్టు కోవడంతో పాటు రాజ్యాంగ స్ఫూర్తిని గౌరవించే విధంగా పార్టీలకు అతీతంగా ప్రతిఒక్కరు మద్దత్తు పలకాలని ఆమె కోరారు.



శివరాంపల్లి లో కాలి పోయిన తన ఇంటి వద్ద విశ్రాంత ఎస్ ఐ పి జీవన్ దాస్



కాలిపోయిన జీవన్ దాస్ ఇల్లు

# పి జీవన్ దాస్ ఇంటిని పునర్నించి ఇవ్వాలి

### దళిత సంఘాల నాయకులు

**బుద్వేల్, ఏప్రిల్ 13(ప్రభాత ఉదయం)**

శివరాంపల్లి లో ఆదివారం జనావాసాల మధ్య ఉన్న డెకరేషన్ గోదాము తగులబడటంతో పక్కన ఉన్న విశ్రాంత ఎస్ఐ పి జీవన్ దాస్ ఇంటి పై అంతస్థు పూర్తిగా కాలి పోయిందని, జీవన్ దాస్ కు చెందిన ఇంటిని పక్క స్థల యజమాని అయిన కొత్త మహేశ్ రెడ్డి పునర్ నిర్మించి ఇవ్వాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం శివరాంపల్లిలో పూర్తిగా కాలి పోయిన పి జీవన్ దాస్ నివాసాన్ని రాజేంద్రనగర్ సర్కిల్ దళిత సంఘాల నాయకులు దాసరి రమేశ్, పలుగుచెరువు మహేశ్, ఎడ్లకాడి సూర్యం, అనుముల జాన్ పాల్, మంగలారం శ్రీనివాస్ తదితరులు పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ, కొత్త మహేశ్ రెడ్డికి పి జీవన్ దాస్ ఇంటిపక్కన ఉన్న ఖాళీ స్థలంలో జహంగీర్ అనే వ్యక్తికి ఫ్లవర్ డెకరేషన్ కు అద్దెకు ఇచ్చాడన్నారు. జహంగీర్ నడిపే ఫ్లవర్ డెకరేషన్ గోదాములో ఆదివారం మంటలు ఎగిసి పడి పూర్తిగా కాలిపోవడంతో పాటు గోదాము కు ఆనుకుని ఉన్న పి జీవన్ దాస్ ఇంటి రెండవ అంతస్తు పూర్తిగా కాలిపోయిందన్నారు. గోడలు పనికి రాకుండ పోయాయని, కిటికీలు, బాత్రూమ్ లు డ్రైనేజీ పైపులు, నల్లా పైపులు పూర్తిగా కాలిపోయాయన్నారు. మొదటి అంతస్తులోని ఒక బాగం పూర్తిగా కాలిపోయిందని గుర్తు చేశారు. ఇంటి గోడలన్ని మంటలకు నల్లగా మారిపోయాయని తెలిపారు. కొత్త మహేశ్ రెడ్డి గోడలను బాగు చేసి, రెండవ అంతస్తు స్లాబ్ వేయించి అన్ని మరమ్మత్తులు చేసి రంగులు వేసి ఇవ్వాలని కోరారు. ఇదే విషయమై అత్తాపూర్ పోలీసులకు, ఎస్సీ ఎస్టీ కమిషన్ కు, రంగారెడ్డి జిల్లా కలెక్టర్, రాజేంద్రనగర్ ఆర్డీవో , రాజేంద్రనగర్ తహసీల్దార్ కు వినతి పత్రాలు అందజేయడం జరుగుతుందన్నారు

**పడుకోవడానికి వీలు లేకుండ ఉంది : పి జీవన్ దాస్**

తన ఇంటి పక్కన ఉన్న గోదాము తగులబడటంతో పక్కనే ఉన్న తన ఇల్లు పూర్తిగా కాలిపోయిందని, ఈ విషయమై అత్తాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేయడం జరిగిందని విశ్రాంత ఎస్ఐ పి జీవన్ దాస్ తెలి పారు. తన ఇంటిని పక్క స్థలం వ్యక్తి అయిన కొత్త మహేశ్ రెడ్డి బాగు చేసి ఇవ్వాలన్నారు. గోదాముకు ఆయనే అద్దెకు ఇచ్చాడని గుర్తు చేశారు. పడుకోవడానికి స్థలం లేకుండా పోయిందని, వాష్రూమ్ కు వెళ్లాలన్నా, అవన్ని పాడై పోయాయన్నారు. దీనిపై కొత్త మహేష్ రెడ్డి కల్పించుకుని తమకు న్యాయం చేయాలన్నారు.

# ప్రజల ప్రాణ భద్రతే లక్ష్యం



ప్రతిజ్ఞ చేపిస్తున్న సర్పంచ్ రామకృష్ణ

### రోడ్డు భద్రతపై అప్రమత్తత అవసరం

### జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**జనగామ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 13(ప్రభాత ఉదయం):**

ప్రజల ప్రాణ భద్రతే లక్ష్యమని...రోడ్డు భద్రతపై ప్రజలు అప్రమత్తత అవసరమని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. 99 రోజుల ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తోన్న అరైవ్ - అలైవ్ లో భాగం గా లిరోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా జిల్లాలోని లింగాల ఘనపురం మండలంలోని నెల్లుట్ల గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ నర్సింగ రామకృష్ణ అధ్యక్షతన సోమవారం రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీసీపీ రాజ మహేంద్ర నాయక్ తో కలిసి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల నివారణలో ప్రతి ఒక్కరి పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం, మొబైల్ ఫోన్ వినియోగం వంటి అలవాట్లు ప్రమాదాలకు ప్రధాన కారణాలని తెలిపారు. శిరస్త్రాణం (హెల్మెట్), సీట్ బెల్ట్ వినియోగం తప్పనిసరి అని సూచించారు. ప్రతి ఒక్కరూ నిబద్ధతతో ఖచ్చితంగా శిరస్త్రాణం ధరించాలని కోరారు. ఎట్టి పరిస్థితుల్లోనూ మద్యం సేవించి వాహనం నడపకూడదు అని సూచించారు. అలాగే ఐఎస్ఐ ధృవీకరించిన హెల్మెట్ (శిరస్త్రాణం)లను మాత్రమే ఉపయోగించాలని, తద్వారా ప్రమాదాల సమయంలో తలకు పటిష్ట రక్షణ కల్పించి, ప్రాణ నష్టం తగ్గించవచ్చని వివరించారు. పాదచారులు కూడా జాగ్రత్తగా రోడ్లు దాటాలని, నిర్దేశిత జీబ్రా క్రాసింగ్‌లను వినియోగించాలని చెప్పారు. ప్రజల సహకారంతోనే ప్రమాదాలను తగ్గించవచ్చని, ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా ప్రవర్తించాలని స్పష్టం చేశారు. అనంతరం డీసీపీ మాట్లాడుతూ.. నేటి నుంచి ఈ నెల 18వ తేదీ వరకు అరైవ్ - అలైవ్ కార్యక్రమ వారోత్సవాలు జరుగుతాయని తెలిపారు. జిల్లాలోని (280) గ్రామ పంచాయతీల్లో రోడ్డు భద్రత గ్రామ కమిటీలు ఏర్పాటు చేసి, సమావేశాలను చేపడుతున్నామని, అదే విధంగా ప్రజల్లో రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించడం, ట్రాఫిక్ నిబంధనల పట్ల బాధ్యతాయుత ప్రవర్తనను అలవరచడం, రోడ్డు ప్రమాదాలను తగ్గించి, ప్రాణ నష్టాన్ని నివారించడం ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. తదనంతరం రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన పెంపొందించేందుకు వారు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీఆర్డీఓ నూరుద్దీన్, ఇతర సంబంధిత అధికారులు, పోలీసు అధికారులు, గ్రామ సర్పంచ్ నర్సింగ రామకృష్ణ, పంచాయతీ, పోలీసు సిబ్బంది, డీపీవో , ఎంపీవో , సీసీ నర్రా శ్రీకాంత్ రెడ్డి, ఏఎన్ఎం సంపూర్ణ, గ్రామ పంచాయతీ కార్యదర్శి రోండ్ల శ్రీనివాస్ రెడ్డి, ఉప సర్పంచ్ దామెర కావ్య ప్రభాకర్, ,విడిసి చెర్మన్ బత్తిని అశోక్ కుమార్ గౌడ్, స్టాండింగ్ కమిటీ మెంబర్లు గుర్రం బాలరాజు గౌడ, కుర్రేముల రమేష్ గౌడ్, శివార్రతి ఎల్లయ్య, చిట్ల తిరుమల రెడ్డి, వార్డ్ మెంబర్స్ కొయ్యడ అనిల్, వేల్పుల శోభారాణి, గొరిగే సందీప్, కత్తి శ్రీవాణి, బొజ్జం సునీత ప్రభాకర్ , నల్ల అజయ్, ,వంగ సతీష్, బడారి మమత అశోక్, గొరిగే సాయిలు, కొమ్మరాజుల రేణుక కొమ్మురాయ, తాంద్ర భారత్,మాజీ ఎంపీటీసీ మోటే వీరస్వామి, మహిళా సంఘాల అధ్యక్షులు కార్యదర్శిలు విఓఏ లు అంగన్వాడి టీచర్స్, ఆశ వర్కర్స్, నాయకులు కొయ్యడ రామచేంద్రం, రామలింగం, జెగ్గం ఆనంద్ నర్సింగ రమేష్, మారబోయిన వేణు, యేనగందుల బాలస్వామి, మారబోయిన ఉపలయ్య, కొత్తకొండ గంగాధర్, ఎడ్ల జాన్, గొరిగే మధు, జిగురు ఉపేందర్, పెరబోయిన భారతి, నర్సింగ రాములు, కటం రాజశేఖర్,, రిజవాన్ తదితరులు పాల్గొన్నారు గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# గడ్డపోతారం అయ్యమ్మ చెరువు కాలుష్య సమస్యకు శాశ్వత పరిష్కారం : ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి







### చెరువుల్లోకి కాలుష్య జలాలు వదిలితే భరతం పడతాం

### ప్రజల ప్రాణాలు పోతుంటే మీకు పట్టింపు లేదా?

### పిసిబి, నీటి పారుదల శాఖల అధికారులపై ఎమ్మెల్యే ఫైర్

### ప్రకృతిని విధ్వంసం చేస్తే ప్రజా ఆగ్రహానికి గురి కాక తప్పదు

### తీరు మార్చుకోకపోతే మూసుకోవాల్సిందే

### కాలుష్య కారక పరిశ్రమలకు ఎమ్మెల్యే అల్టిమేటం

### అయ్యమ్మ చెరువు పరిస్థితిపై ఎమ్మెల్యే సమీక్ష సమావేశం


**పటాన్ చెరు, ఏప్రిల్ 13 (ప్రభాత ఉదయం):**

ప్రజలకు ఉపాధి లభిస్తుందని పరిశ్రమల స్థాపనకు స్వాగతం పలికితే.. నేడు అవే పరిశ్రమలు ప్రజల ప్రాణాలు తీస్తూ ప్రతి రోజు కాలపూట విషాన్ని వెదజల్లుతున్నాయని,తీరు మార్చుకోకపోతే ప్రజల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి హెచ్చరించారు. గడ్డపోతారం మున్సిపల్ పరిధిలోని చెట్ల పోతారం పరిధిలోగల అయ్యమ్మ చెరువు పరిస్థితిపై సోమవారం మున్సిపల్ పాలకవర్గం సభ్యులు, వివిధ శాఖల అధికారులతో కలిసి చెరువు కట్టపైనే ఎమ్మెల్యే జిఎంఆర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చెరువులో కాలుష్య జలాలు కలవడం మూలంగా ఎదుర్కొంటున్న సమస్యలను ప్రజలు ఎమ్మెల్యే కు తెలిపారు. ప్రతి రోజు ప్రత్యక్ష నరకం అనుభవించడంతోపాటు,క్యాన్సర్ లాంటి వ్యాధులు సోకి ఆర్థికంగా, మానసికంగా, ఆరోగ్యపరంగా తమ బతుకులు చిద్రమవుతున్నాయని వారు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. కాలుష్య సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని విన్నవించారు. అనంతరం ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ గడ్డపోతారం పరిధిలో పరిశ్రమల ఏర్పాటు ద్వారా స్థానికులకు ఉపాధి లభించడంతోపాటు ప్రజలు ఆర్థిక అభ్యున్నతి సాధిస్తారని పరిశ్రమల ఏర్పాటుకు అంగీకారం తెలిపితే నేడు అవే పరిశ్రమలు నిబంధనలు ఉల్లంఘిస్తూ స్థానిక చెరువులను తమ రసాయన జలాలతో కాలుష్యం చేస్తూ ప్రకృతిని విధ్వంసం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే అంశంపై వివిధ సందర్భాల్లో తీరు మార్చుకోవాలని పరిశ్రమల యాజమాన్యాలకు సైతం సూచించినప్పటికి ఎలాంటి మార్పు కనిపించడం లేదని అసహనం వ్యక్తం చేశారు. చెరువుల్లోకి కాలుష్య జలాలు వదలడం మూలంగా స్థానికంగా వ్యవసాయ రంగం పూర్తిగా విధ్వంసం కావడంతో పాటు పశుపక్షాదులు సైతం ప్రాణాలు కోల్పోతున్నాయని తెలిపారు. మహిళలకు వివిధ రకాల క్యాన్సర్లు సోకి నరకయాతన అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాలను వదిలివేసి వలసలు వెళ్లాల్సిన పరిస్థితిలు ఉత్పన్నమవుతున్నాయని తెలిపారు. ప్రజల కోసం ఎలాంటి పోరాటానికైనా సిద్ధమని, అవసరమైతే కాలుష్య పరిశ్రమలను తరిమికొడతామని హెచ్చరించారు. కాలుష్యాన్ని అరికట్టాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాలుష్యాన్ని వెదజల్లుతున్న పరిశ్రమల పై ప్రజలు నేరుగా ఫిర్యాదులు ఇస్తున్నప్పటికీ ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. మీ నిర్లక్ష్యం, చేతగానితనం మూలంగానే పరిశ్రమలు విచ్చలవిడిగా కాలుష్యాన్ని వెదజల్లుతున్నాయని అన్నారు. అయ్యమ్మ చెరువు కాలుష్య సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు తీసుకోబోతున్నట్లు ఆయన తెలిపారు. చెట్ల పోతారం నుండి కిష్టాయపల్లి, గండి చెరువు, కృష్ణారెడ్డిపేట చెరువు మీదుగా నక్క వాగు వరకు 6 ఫీట్ డయా పైపు లైన్ నిర్మాణం చేయనున్నట్లు తెలిపారు. చెరువు పరిధిలో కట్టుదిట్టమైన ఫెన్సింగ్ నిర్మాణం చేసి పశువులు వెళ్లకుండా చర్యలు తీసుకోబోతున్నట్లు తెలిపారు. స్థానికంగా కాలుష్యాన్ని వెదజల్లుతున్న 14 పరిశ్రమలపై ప్రభుత్వానికి ఫిర్యాదు చేయబోతున్నట్లు తెలిపారు. ప్రస్తుతానికి అయ్యమ్మ చెరువులోని కాలుష్య జలాలను పూర్తిగా తొలగించనున్నట్లు తెలిపారు. ప్రజల ప్రాణాల కంటే విలువైనది ఏమీ లేదని, ఇక నుండి పరిశ్రమలు అప్రమత్తంగా ఉండాలని కాలుష్య జలాలను వదిలితే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ కాలుష్య జలాలను వదులుతున్న పరిశ్రమలు సీజ్ చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో పిసిబి ఈఈ కుమార్ పాఠక్, నీటిపారుదల శాఖ ఈఈ భీమ్,గడ్డపోతారం మున్సిపల్ చైర్మన్ సుష్మ గణేష్, వైస్ చైర్మన్ మహేందర్ గౌడ్, గడ్డపోతారం మున్సిపల్ కమిషనర్ వెంకటరామయ్య, సీఐ రవీందర్ రెడ్డి, జిన్నారం మున్సిపల్ చైర్మన్ జనార్ధన్, సీనియర్ నాయకులు బాల్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, వెంకటేష్ గౌడ్, గద్దె నరసింహ, ప్రకాష్ చారి, కౌన్సిలర్లు, మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఇంటర్ ఫలితాల్లో ముత్తంగి బాలికల కళాశాల విద్యార్థినిల ప్రతిభ




ఆర్ జగదీశ్వరి
బైపిసి లో 435/440




బి.అంజలి
బైపిసి లో 991/1000



ఎం అక్షిత
ఎంపిసి 454/470



సిహెచ్ పూజ
ఎంపిసి 990/1000




ఎస్.చైతన్య
సిఇసి 487/500

### ఫలితాల్లో రాష్ట్ర స్థాయి ర్యాంకులు

**పటాన్ చెరు, ఏప్రిల్ 13 (ప్రభాత ఉదయం):**

ఉమ్మడి మెదక్ జిల్లాలో ఇంటర్మీడియట్ ఫలితాల్లో బీసీ గురుకులాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. రాష్ట్ర స్థాయిలో ప్రథమ ర్యాంకులు సాధించారు.సంగారెడ్డి జిల్లాలోని ముత్తంగి బాలికల కళాశాలకు చెందిన ప్రథమ సంవత్సర విద్యార్థిని ఎంపీసీ గ్రూపులో 470 మార్కులకు గాను బి. నవ్య 466 మార్కులు,ఎస్. అనుష 463 మార్కులు , బైపీసీ గ్రూప్ లో 440 మార్కులకు గాను జీ. జగదీశ్వారి 437, పీ. ప్రసన్న 436 మార్కులు సీ ఈ సి గ్రూపు లో 500 మార్కులకి గాను ఎస్. చైతన్య 489, డీ . వైష్ణవి 487 మార్కులు యమ్ ఈ సి గ్రూపు లో 500 మార్కులకి గాను యమ్ . అర్చన 490, జీ. శివాని 485 మార్కులు సాధించారు.ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో ఎంపీసీ గ్రూపు శ్రీశీ1000 మార్కులకు గాను సీచ్. పూజ 990, కే.రితిక 989 మార్కులు. బైపీసీ గ్రూపు లో 1000 మార్కులకి గాను బి. అంజలి 991, సీ హెచ్. అంజలి 987 మార్కులు . సిఇసి లో 1000 మార్కులకి గాను సీ హెచ్. శ్రీలత 981, ఏ. రేవతి 979. ఎంఇసి గ్రూప్ లో 1000 మార్కులకి గాను ఏ. జాహ్నవి 983, యన్. శ్రావణి 982 మార్కులు సాధించి అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. ప్రథమ సంవత్సరం మొత్తం ఉత్తీర్ణత శాతం 93.61 శాతం ద్వితీయ సంవత్సరం 95.84 శాతం సాధించారు. ఈ విద్యార్థులందరు విజయం సాధించటానికి కళాశాల ప్రిన్సిపాల్ హరిత, అధ్యాపకుల మార్గదర్శకత్వమే ముఖ్య కారణమని ,వారి సహకారం తో ఈ విజయం సాధించామని విద్యార్థులందరు చెప్పారు.



# నిరుపేదలకు ఆపన్నహస్తం ముఖ్యమంత్రి సహాయ నిధి

### పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

### ఒక లక్ష 90 వేల రూపాయల విలువైన ఎల్ఓసిల పంపిణీ

**పటాన్ చెరు, ఏప్రిల్ 13 (ప్రభాత ఉదయం):**

ఆపత్కాల సమయంలో నిరుపేదలకు ఆపన్న హస్తం అందించడంలో ముఖ్యమంత్రి సహాయనిధి అండగా నిలుస్తోందని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. బొల్లారం డివిజన్ పరిధిలోని బీరప్ప బస్తీకి చెందిన కాజిం ఖాన్, బీరంగూడ డివిజన్ పరిధిలోని వందన పురి కాలనీకి చెందిన బండ ప్రభాకర్ లు మెరుగైన చికిత్స కోసం ఎమ్మెల్యే జిఎంఆర్ ద్వారా ముఖ్యమంత్రి సహాయనిధి కి దరఖాస్తు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం నుండి మంజూరైన ఒక లక్ష 90 వేల రూపాయల విలువైన ఎల్ఓసి పత్రాలను సోమవారం సాయంత్రం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి పంపిణీ చేశారు.




జిల్లా నూతన కార్యవర్గంతో డిసిసి అధ్యక్షులు రాజీవ్ రెడ్డి, నాగర్ కర్నూల్ పార్లమెంట్ కాంగ్రెస్ ఇంచార్జ్ సానెం శ్రీనివాస్ గౌడ్

# పార్టీ పటిష్టత కోసం నూతన కార్యవర్గం అంకితభావంతో పనిచేయాలి

### డిసిసి అధ్యక్షులు రాజీవ్ రెడ్డి

### డిసిసి నూతన కార్యవర్గాన్ని సన్మానించిన డిసిసి అధ్యక్షుడు రాజీవ్ రెడ్డి

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 13(ప్రభాత ఉదయం)**

పార్టీ పటిష్టత కోసం, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల ముందుకు తీసుకెళ్లడం కోసం నూతన జిల్లా కార్యవర్గం అంకిత భావంతో పనిచేయాలని గద్వాల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎం రాజీవ్ రెడ్డి సూచించారు. సోమవారం జిల్లా కేంద్రంలలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో డీసిసి అధ్యక్షుడు రాజీవ్ రెడ్డి అధ్యక్షతన నాగర్ కర్నూల్ పార్లమెంట్ ఇంచార్జ్ శ్రీనివాస్ గౌడ్ ల సమక్షంలో నూతనంగా ఎన్నికైన ఉపాధ్యక్షులు జనరల్ సెక్రటరీలు , సెక్రటరీలను సన్మానించారు. ఈ సందర్భంగా రాజీవ్ రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి, పార్టీ సీనియర్ నాయకుల తో కలిసి వాటిని మరింత బలోపేతం చేయడానికి శక్తివంతన లేకుండా కృషి చేస్తామన్నారు. నూతన కార్యవర్గానికి రాజీవ్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్ లు నూతన కార్యవర్గానికి దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో డిసీసీ ఉపాధ్యక్షులు రామేశ్వరమ్మ, ఎండి.గౌస్, ఎల్లారెడ్డి, మద్దిలేటి, జనరల్ సెక్రెటరీలు అంజి సాగర్, వెంకటేశ్వర్ రెడ్డి,లక్ష్మన్న,మంగలి నరసింహులు,సీరాజ్ అహ్మద్,సంకాపురం రాముడు, నర్సిరెడ్డి,లక్ష్మీదర్ రెడ్డి,సెక్రటరీలు గవ్వ తిమ్మప్ప,రామాంజనేయులు, విజయభాస్కర్ రెడ్డి, వీరేష్, శ్యామ్ కుమార్,యోగి రెడ్డి శేఖర్ రెడ్డి,నర్సన్ గౌడ్, తిమ్మారెడ్డి,జైపాల్ రెడ్డి,మధు నాయుడు,నరేందర్ లను శాలువా తో సన్మానించారు.



# బీపీ మండల్ సమానత్వానికి మార్గదర్శి

### బీసీ కులాల ఐక్య వేదిక కన్వీనర్ గౌనికాడి రాములు యాదవ్

**కొత్తకోట, ఏప్రిల్ 13(ప్రభాత ఉదయం)**

సామాజిక న్యాయం కోసం పోరాడిన మహనీయుడు బీపీ మండల్ వర్ధంతి సందర్భంగా కొత్తకోట మండల కేంద్రంలో ఘనంగా నివాళులు అర్పించారు ఈ కార్యక్రమాన్ని బీసీ కులాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా బీపీ మండల్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకుంటూ, బీసీ వర్గాల అభివృద్ధికి ఆయన చేసిన కృషి అపారమని నాయకులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న గౌనికాడి రాములు యాదవ్ మాట్లాడుతూ... బీపీ మండల్ సిఫారసులు దేశంలోని వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి మార్గదర్శకంగా నిలిచాయని అన్నారు. సమాజంలో సమానత్వం సాధించడానికి ఆయన చూపిన మార్గం అందరికీ ఆదర్శమని పేర్కొన్నారు. బీసీ వర్గాల హక్కుల సాధన కోసం ఐక్యంగా పోరాడాలని, విద్యా మరియు ఉపాధి రంగాల్లో మరింత అవకాశాలు పొందేందుకు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, ప్రజా ప్రతినిధులు, బీసీ సంఘాల నాయకులు మాజీ కౌన్సిలర్ మురళి యాదవ్ మంజుల రామకృష్ణ యాదవ్ మాజీ ఎంపిటిసి నెలవిడి కుర్మన్న వెంకటన్న గౌడ్ కొత్త గంగాధర్ ముదిరాజ్ విజయ్ కుమార్ శివశంకర్ కురుమూర్తి యాదవ్ తాతయ్య ముదిరాజ్ రాములు యాదవ్ ఉషాన్న యాదవ్ బాలు నాగరాజు యాదవ్ మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.